ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం

గచ్చిబౌలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. దీనిలో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్‌లో కొత్త జాబితా రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించడం, కొత్తవారు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని ఉప మిషనర్ రజనీకాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 27 నుంచి అక్టోబర్ 18 వరకు అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని బీఎల్‌ఓలు ప్రతీఇంటికి వెళ్తారన్నారు. రెండునెలల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. అక్టోబర్ 29న ముసాయిదా విడుదలవుతుందని, నవంబర్ 28 నుంచి జాబితాపై ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. జనవరి 26న తుది జాబితా విడుదల చేసి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొదుపు సంఘాల మహిళలకు శిక్షణ

గచ్చిబౌలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో పొదుపు సంఘాల మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపడుతోందని ప్రాజెక్టు అధికారి మల్లేశ్వరి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల మహిళలకు వివిధ రంగాల్లో చిరువ్యాపారులు పెట్టుకునే విధంగా వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన సామగ్రిని కల్పించనున్నట్లు వివరించారు. శిక్షణలు ఇచ్చి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు, కుట్టు కేంద్రాలు, మహిళా బజార్, స్ట్రీట్‌వెండర్స్ కోల్డ్ స్టోరేజ్‌లు, యువశక్తి, యువసేవకి, లేబర్ అడ్డ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్‌యూనిట్, ఫ్యాన్సీ స్టోరేజ్, బేకరీలు, డెయిరీ ప్రొడక్ట్స్ ఔట్‌లెట్‌లు, తదితర అంశాల్లో ఆశక్తి గల వారికి శిక్షణ ఇచ్చి దుకాణ సదుపాయాలు కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి కలవారు శేరిలింగంపల్లి మున్సిపాల్ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారిని సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ రాంకీ పెరల్ మెయిన్‌గేటు ఎదురుగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఫారూఖ్, ఖలీమ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.


అమ్మవారికి మొక్కుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దైవారాధనతో మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే

గాజులరామారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దైవారాధనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారంలోని నల్లపోచమ్మ రేణుకా ఎల్లమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామ్‌రెడ్డి, బాలరాజు, ఇబ్రహీం, విజయ్‌కుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణం కోసం రోడ్డు మూసివేత


రోడ్డుకు అడ్డుగా పెట్టిన వాహనం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణం కోసం గత పది రోజులుగా రోడ్డు మూసేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీబీసీఐడీ కాలనీలో 250 గజాల్లో ఇంటి నిర్మాణం కోసం రోడ్డును రెండు వైపులా మూసేసి పనులు చేస్తున్నాడు. ఆ మార్గంలో సీబీసీఐడీ, భగత్ సింగ్‌నగర్ ఫేజ్-2, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కనీసం నడిచి వెళ్లడానికి వీల్లేండా రోడ్డు మూసేయడంతో స్థానికులు నిర్మాణదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును బ్లాక్ చేసినా సదరు నిర్మాణదారుడిపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెట్రో సాధన సమితి సభ్యులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జేబీఎస్ నుంచి శామీర్‌పేట్, ప్యారడైజ్ నుంచి కొంపల్లి, మేడ్చల్ వరకూ మెట్రోమార్గాన్ని విస్తరించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేడ్చల్ వరకూ మెట్రోను విస్తరించేలా ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు కోరారు. మేడ్చల్ జిల్లా పరిసర ప్రాంతాల్లోని సుమారు 60 వేల మంది ఉద్యోగులు నిత్యం ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మెట్రోను మేడ్చల్ వరకు విస్తరింపజేయాలని తెలియజేశారు. సంపత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జార్జ్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలా రిటర్నింగ్ పనులను సకాలంలో పూర్తి చేయిస్తా


రిటర్నింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తప్పకుండా పరిష్కరిస్తానని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హా మీ ఇచ్చారు. జింకలవాడ నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణం పనులను అధికారులు బస్తీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ దీనదయాల్‌నగర్ - జింకలవాడ మీదు గా సమతానగర్ వరకు రూ. 90 లక్షల నిధులతో నాలా రిటర్నింగ్ వాల్ పనులు చేపట్టామన్నారు. పెండింగ్‌లో ఉన్న దీనదయాల్‌నగర్ రిటర్నింగ్ వాల్ పనులనూ సకాలంలో పూర్తి చేయిస్తామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, యాదగిరి, బాల నర్సింహ, సంతోష్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి

చోరీ అయిన ఫోన్‌లు బాధితులకు అందజేత

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 'మీ ఫోన్ దొంగిలించినా, పడిపోయినా వెంటనే మీ ఏరియాలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి' అని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ ఆరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు వాటిని రికవరీ చేసి అప్పగించారు. ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్ పోర్టల్‌ను ఉపయోగించి 30 రోజుల్లో 130 మొబైల్ ఫోన్‌లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. నాలుగు నెలల్లో మేడ్చల్ జోన్ పరిధిలో స్మార్ట్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. సీఈఐఆర్ ద్వారా మేడ్చల్ పరిధిలోని రూ.20 లక్షల విలువ చేసే 130 స్మార్ట్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. మేడ్చల్, పేట్‌బషీరాబాద్, అల్వాల్, దుండిగల్ డీఐలు వెంకట్‌రెడ్డి, నర్సింహరాజు, రాజేందర్‌గౌడ్, సతీష్‌కుమార్‌లను డీసీపీ అభినందించారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాల డంపింగ్

అర్ధరాత్రి టిప్పర్లు సీజ్.. డ్రైవర్ల అరెస్ట్


పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

నిజాంపేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా చెత్త, చెదారం, వేస్టు మెటీరియల్‌ను టిప్పర్ల ద్వారా తరలించి ప్రభుత్వ భూమిల్లో డంప్ చేస్తున్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే రాత్రికి రాతే వర్థాలను డంప్ చేస్తున్నారు. ఇలా అర్ధరాత్రి వ్యర్థాలు డంప్ చేస్తున్న ఐదు టిప్పర్లను, వాటికి సంబంధించిన డ్రైవర్లను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. బాచుపల్లి సర్వేనెంబరు 186 ప్రభుత్వ భూమిలో డబుల్ బెడ్‌రూమ్ వెనకాల ఉన్న ప్రభుత్వ భూమిని ఆసరగా చేసుకున్న ఆక్రమణదారులు గాజులరామారం, కైసర్‌నగర్, సూరారం ఇతర ప్రాంతాల నుంచి రోజూ రాత్రి సమయాల్లో వందలాది టిప్పర్లతో మట్టిని ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక హిల్‌కౌంటీవాసుల స్థానిక నాయకులకు సమాచారం ఇచ్చారు. వారు గురువారం రాత్రి బాచుపల్లి సీఐకి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వెళ్లి టిప్పర్ల ద్వారా మట్టి నింపుతున్న విషయాన్ని గమనించి, అప్పటికప్పుడు అక్కడ ఉన్న ఐదు టిప్పర్లను, టిప్పర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇలా దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను విచ్చలవిడిగా తరలిస్తున్న టిప్పర్ల నిర్వాహకులకు జరిమానా వేయాలని బాచుపల్లి సీఐ ఉపేందర్ నిజాంపేట్ మున్సిపల్ అధికారులకు లేఖలో తెలిపారు. అదే విధంగా టిప్పర్లను సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశా మని సీఐ తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పరువుకు భంగం కలిగించారని ఆర్ఐ ఫిర్యాదు


బాలానగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బాలానగర్ రాజుకాలనీలో వేస్తున్న ఓ బోరు విషయంలో బాలానగర్ తహసీల్దార్, ఆర్ఐ డబ్బులు తీసుకుని బోరు బండిని వదిలేశారని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని, నిజానిజాలు నిర్ధారణ చేసుకోకుండా కథనాలు రాసి తమ పరువుకు భంగం కలిగించిన రిపోర్టర్లపై వెంటనే చర్యలు చేపట్టాలని బాలానగర్ మండల ఆర్ఐ బి.నాగమణి పోలీసులకు ఫిర్యాదు శుక్రవారం చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు హస్మత్‌పేట్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ఇళ్లకు నోటీసులు జారీ చేయడంతో బిజీగా ఉన్నామని, తహసీల్దార్ నుంచి ఆదేశాలు రాగానే సిబ్బందిని పంపించి బోరును ఆపించామని పేర్కొన్నారు. ఈ విషయంలో డబ్బులు తీసుకున్నారనేది పూర్తిగా అవాస్తవవిమన్నారు. ఆర్ఐ ఫిర్యాదును పరిశీలించిన డీఐ నాగిరెడ్డి డిఫర్‌మేషన్ కేసు వేయాలని సూచించడంతో ఆమె ఆ పనిలో ఉన్నట్లు తెలిసింది.

గాయత్రీనగర్ రోడ్లను బాగు చేయండి


గాయత్రీనగర్ చౌరస్తాలో రహదారి దుస్థితి


కుంటను తలపిస్తున్న రహదారి

పేట్‌బషీరాబాద్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. జీడిమెట్ల డివిజన్‌లోని గాయత్రీనగర్ రహదారులపై ప్రయాణం చేయలేకపోతున్నామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలతో రహదారులు కుంటలను తలపిస్తున్నాయని, అస్తవ్యస్త రోడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

హైదర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీకి చెందిన రజిత అత్యవసర వైద్యచికిత్స కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఆమె వైద్యం కోసం మంజూరైన రూ.2.30 లక్షల చెక్కును ఆమె కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాశీనాథ్‌యాదవ్, అశోక్ పాల్గొన్నారు.

- హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్ డబుల్‌బెడ్‌రూం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి ప్రహరీ, వీధిదీపాలు, సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, మంచినీటి బోరు వేయించాలని వినతిపత్రంలో కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.


'రాజ్‌కహాని' చిత్రం నిజాంపేట్ కార్పొరేషన్ పరిసర ప్రాంతంలో చిత్రీకరించినట్లు నిర్మాత, దర్శకుడు రాజ్‌కార్తికేన్ తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్‌లో ప్రదర్శింప బడుతుందని తెలిపారు. కార్పొరేషన్ నిర్వాహకులకు, మేయర్ నీరెడ్డికి చిత్ర నిర్మాత, దర్శకుడు కృతజ్ఞతలు తెలిపారు.

\- నిజాంపేట్, ఆంధ్రజ్యోతి

పవర్ లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీలకు తపస్య


తపస్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పవర్ లిఫ్టింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలకు హైదరాబాద్ అమ్మాయి ఇంటూరి తపస్య అర్హత సాధించింది. జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణం సాధించిన తపస్య నవంబరులో జరగనున్న వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననుంది. తపస్య 44 కిలోల విభాగంలోని 'రా లిఫ్టింగ్ ఈవెంట్‌లో పోటీ పడనుంది. అయితే, ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.2.50 లక్షల వరకు ఖర్చు అవనుండడంతో పేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి ప్రభుత్వ, దాతల సహాయం కోసం ఎదురు చూస్తోంది. ఈ అమ్మాయికి సహాయం చేయదలిచిన వారు ఈ నెంబరుకు 8790022909 సంప్రదించవచ్చు.



ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో శ్రీనివాస్

హైటెక్స్‌లో స్పోర్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైటెక్స్‌లో ఎన్‌ఎండీసీ ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఎక్స్‌పోను సినీ నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్ ప్రారంభించారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ ఎక్స్‌పోలో వివిధ క్రీడా ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో వ్యాయామం, క్రీడలకు చోటు ఇవ్వాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎండీసీ ఈడీ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి


మల్లేశ్ (ఫైల్)

బాలానగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు పుట్టపాక మల్లేశ్ గుండెపోటుతో మరణించాడు. రాత్రి గుండె నొప్పిరావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతున్న శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్ కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుడికి భార్య ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వీసా ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి కిడ్నాప్

● ఆరుగురి అరెస్ట్

నిజాంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో మెడిసిన్ చదివేందుకు వీసా కోసం రూ.4 లక్షల తీసుకొని విదేశాలకు పంపకుండా మోసం చేస్తున్న వ్యక్తి ని బాధితులు కిడ్నాప్ చేశారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాయచోటికి చెందిన శివశంకర్‌రెడ్డి నిజాంపేట్‌లోని తిరు సంకల్ప విల్లాస్‌లో ఉంటూ మలక్‌పేట, నిజాంపేటలో ఎస్‌ఎస్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. మెడిసిన్ చదివేందుకు విదేశాలకు వెళ్తేందుకు శివశంకర్‌రెడ్డికి 4 లక్షల రూపాయలను కిడ్నాపర్లు ఇచ్చారు. ఆపై వీసా ఇప్పించడం లేదు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఎనిమిది మంది కారులో శివశంకర్‌రెడ్డి ఇంటికి గురువారం రాత్రి వచ్చి అతడిని కిడ్నాప్ ప్రయత్నించారు. ఈ క్రమంలో భార్య, కూతురు అడ్డు రాగా వారిని కొట్టి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి శివశంకర్‌రెడ్డిని కారులో బలవంతంగా తీసుకెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని రాచకొండ, నల్గొండ, సైబర్ కంట్రోల్‌ను అలర్ట్ చేశారు. కిడ్నాపర్లను సూర్యాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ వారిలో ఎర్ర వీరయ్య, పొరెండ్ల దశరథ, ఎం శ్రావణ్‌కుమార్, ఎ.వెంకటరామ్‌రెడ్డి, భానోతి నాగు, ఎ పద్మలను అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ప్రయాణికుల దృష్టి మళ్లించి చోరీలు

హైదరాబాద్ సిటీ: ప్రయాణికుల దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బేగంపేట పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ముఠాలో ప్రధాన సూత్రధారి ఢిల్లీకి చెందిన ఇర్ఫాన్(49) బోరబండకు చెందిన మహ్మద్ ఫిరోజ్(38), ఉత్తరప్రదేశ్‌కు చెందిన షాకీర్(30), భార్య రూబీ (23)తో కలిసి ముఠాను తయారు చేశాడు. వీరు రద్దీగా ఉండే బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌ల వద్ద కాపు కాసి, దృష్టి మళ్లించి ప్రయాణికుల బ్యాగ్‌ల నుంచి నగలు, నగదు తస్కరిస్తున్నారు. ముందుగా చోరీ చేయాలని భావించిన వారిని గుర్తించేవారు. మహ్మద్ ఫిరోజ్ ఆటోతో ఎదురుచూస్తుండేవాడు. ఆటోలో షాకీర్, రూబీ ప్రయాణికుల్లా కూర్చునేవారు. టార్గెట్ చేసిన ప్రయాణికుడు ఎక్కడికి వెళ్తున్నాడో ఇర్ఫాన్ తెలుసుకునేవాడు. షేర్ ఆటో పేరుతో ఫిరోజ్ ఆటో ఎక్కించేవాడు. ఆటోలో ఇరుకుగా ఉందని, బ్యాగ్‌లు సూట్‌కేసులు వెనక పెట్టించేవారు. ప్రయాణికుడి దృష్టి మళ్లించి బ్యాగ్‌లు, సూట్‌కేసుల్లో ఉన్న విలువైన వస్తువులు, నగలు కాజేశారు. అనంతరం ఆటో ఆగిపోయిందని చెప్పి ఫిరోజ్ అందరినీ రోడ్డుపై వదిలేసేవాడు. పలువురు ప్రయాణికులను ఈ ముఠా దోచుకుంది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

మానవ హక్కుల కమిషన్ వైస్ చైర్మన్‌గా మల్లారెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న మల్లారెడ్డి

బంజారాహిల్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పైలా మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సౌత్ ఇండియా మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కుర్రా సూర్యనారాయణ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మానవ హక్కుల కోసం శక్తి వంచన లేకుండా పోరాడతానని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ హత్య


శాంతి మృతదేహం

దుండిగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ తండా-2లో ఒంటరిగా ఉంటున్న మహిళ అనుమానాస్పదస్థితిలో హత్యకు గురైంది. హత్యకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దుండిగల్ తండా-2కు చెందిన జరుకుల శాంతి(50) 20 సంవత్సరాల క్రితం భర్త చనిపోయాడు. 10 ఏళ్ల క్రితం కుమారుడు మృతి చెందాడు. కూతురు ఉమాదేవికి వివాహం చేసింది. తండాకు దగ్గరలోనే కిరణాషాపు నడుపుకుంటూ, గేదెలను పోషించుకుంటూ అక్కడే నివాసం ఉంటోంది. రోజూ మాదిరిగానే ఇంట్లో నిద్రించింది. కానీ శుక్రవారం తెల్లవారేసరికి మృతి చెంది ఉంది. తండాలో నివాసం ఉంటున్న కూతురు ఉమాదేవి ఉదయాన్నే తల్లి వద్దకు వచ్చి చూడగా మృతి చెందిఉంది. కుమార్తె రోదిస్తూ స్థానికులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న కౌన్సిలర్, స్థానికులు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దుండిగల్ సీఐ సతీష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సీఐ ద్వారా విషయం తెలుసుకున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తండాకు చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి తల మీద గాయాలను గుర్తించిన పోలీసులు గతంలో ఎవరితోనైనా వివాదాలు ఉన్నాయా? శత్రువులు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో కేసును పరిశీలిస్తామని డీసీపీ తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీమ్ ఫింగర్ ప్రింట్స్ సేకరించింది. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు


పోచమ్మతల్లి

ఖైల్‌కాలనీ, 23 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): బెల్ ఎంఐజి కాలనీలోని లలితా పోచమ్మతల్లి దేవాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం పోచమ్మతల్లికి విశేష ఫల పంచామృతాలతో విశేష అభిషేకం, సాయంత్రం కుంకుమార్చనలు, లలిత సహస్రనామార్చనలు, భజన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ వ్యవస్థాపకుడు మోహన్‌గౌడ్ దంపతులు అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి పోచమ్మతల్లిని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం సామూహిక నామార్చన, భజన కార్యక్రమాలు జరిగాయి. శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా బెల్ టౌన్‌షిప్ ఎలో గల కనకదుర్గాదేవి ఆలయం, పెద్దమ్మతల్లి, కామాక్షి అమ్మవారి ఆలయాల్లో నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

రేపటితో ముగియనున్న కళా సిల్క్స్ చేనేత మేళా


వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను తిలకిస్తున్న యువతులు

అల్లాపూర్, 23 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్స్ 'హ్యాండ్లూమ్-ఎగ్జిబిషన్ సేల్స్' ప్రదర్శనకు ప్రజలు తరలివస్తున్నారు. ప్రదర్శన గత వారమే ముగియాల్సి ఉండగా వీక్షకుల ఆదరణ కారణంగా ఆదివారం దాకా పొడిగించినట్టు నిర్వాహకులు వికాస్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికాస్, వివిధ రకాల వస్తువులు సరికొత్త డిజైన్లతో అందిస్తున్నామన్నారు. యువత ఎక్కువగా హాజరవుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో నేటి తరానికి తగ్గట్టుగా డిజైనర్ వేర్ కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. నాణ్యమైన వస్తువులు వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని వికాస్ కోరారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు



ఫతేనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధి పైప్‌లైన్ రోడ్డు జవహర్‌నగర్ కాలనీ కనకదుర్గ, కాళికాదేవి, శీతలాదేవి ఆలయంలో 3వ శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పసుపు కుంకుమలు ఇచ్చుకున్నారు.

- **కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు.

స్పేస్ రంగంలో యువతకు ఉజ్వల భవిష్యత్

జేఎన్‌టీయూలో నిర్వహించిన స్పేస్ డే సెమినార్‌లో వక్తలు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డా.వైవీఎస్ కృష్ణమూర్తి

జేఎన్‌టీయూ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్పేస్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతకు ఇదొక మంచి సమయమని ఎన్‌ఆర్‌ఎస్‌సీ మాజీ డైరెక్టర్ డా.వైవీఎన్ కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ నేషనల్ స్పేస్ డే సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులతో పాటు పరిశోధకులు స్పేస్ రంగంలో ఉద్యోగాలతో వ్యాపార కోణంలో ఆలోచించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ట్యాక్స్ పేయర్స్‌ను మనం గౌరవించాలని, వారు చెల్లించే ట్యాక్స్ వల్లనే ఇటువంటి పరిశోధనలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. స్పేస్ రంగం అనేది గ్లోబల్ మార్కెట్ అని, ప్రధానమంత్రి మోదీ కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. చంద్రుడిపైకి వెళ్లాలన్న కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవాలని కుతూహలంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం అక్కడికి వెళ్లే శాటిలైట్స్ ఖర్చుతో కూడుకున్నదని, త్వరలోనే నాణ్యమైన శాటిలైట్స్ తక్కువ ధరకు లభించే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దిగుమతి నుంచి ఎగుమతి స్థాయికి మనదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. టెక్నాలజీని యువత అందిపుచ్చుకుంటే ఎంత క్లిష్టమైన పని అయినా సరే ఇష్టంతో చేస్తే అసాధ్యం అనేది ఏదీ ఉండదన్నారు. ఎన్‌ఆర్‌ఎస్‌సీ గ్రూప్ హెడ్ డా. ఐసీదాస్, గరుడాలటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డా.వీవీఎస్ కిరణ్ స్పేస్ రంగంలో జరుగుతున్న పరిశోధనలు, అవకాశాల గురించి విపులంగా వివరించారు. స్పేస్ రంగంలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్స్, స్టార్టప్‌లకు కొదవలేదన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డా.టి.విజయలక్ష్మి, డా.ఎ.వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.